విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

బుధవారం 04 జూన్ 2025 8 పేజీలు

తరలిపోతున్న తెల్ల రాయి

- యథేచ్ఛగా అక్రమ క్వారీయింగ్
- లారీల ద్వారా చెన్నైకు రవాణా
- అక్కడి నుంచి విదేశాలకు తరలింపు
- అక్రమార్కుల్లో అధికార పార్టీ నేతలే అధికం
- ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో గండి
- చోద్యం చూస్తున్న అధికారులు
- నెలవారీ మామూళ్లు ముడుతున్నట్లు ఆరోపణలు

విశాలాంధ్ర-పీసీపల్లి : తెల్లరాయి అక్రమ క్వారీయింగ్ రవాణా మండలంలో జోరుగా సాగుతోంది. నిత్యం పదుల టన్నులు తరలిపోతోంది. జిల్లా ఎల్లలుదాటి నెల్లూరు మీదుగా అక్రమంగా చెన్నైకు చేరుతోంది. అక్కడి నుంచి విదేశాలకు వెళ్తోంది. మండలంలోని మురుగమ్మి ప్రాంతంలో కొందరు ఈ వ్యవహారాన్ని నిర్విఘ్నంగా సాగిస్తున్నారు. వారిలో ఎక్కువ మంది అధికార పార్టీ నాయకులున్నారు. ప్రభుత్వానికి రాయల్టీ, ఇతరత్రా రూపాల్లో రావాల్సిన ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. వారు మాత్రం దండిగా సంపాదిస్తున్నారు. కొందరు నామమాత్రంగా కొంత భూమిని లీజుకు తీసుకొని దాని పేరుతో అంతకు రెండింతలు కొల్లగొడుతున్నారు. అంత జరుగుతున్నా అధికారులు ఆవైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక భారీ మొత్తంలో ముడుపులు ముట్టడమే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అక్రమార్జన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ఆదాయం వచ్చే ప్రతి ఒక్క అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటున్నారు. తెల్లరాయి (వైట్ క్వార్ట్జ్) అక్రమ క్వారీయింగ్, రవాణా ఇందుకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది. ఇష్టానుసారం తవ్వకాలు చేసి అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. రెండు దశాబ్దాల నుంచి అడపాదడపా సాగుతున్న ఈ వ్యవహారం గత కొంతకాలంగా ఊపందుకుంది. పిసిపల్లి మండలంలోని లక్ష్మక్కపల్లి, మురగమ్మి, ముద్దపాడు, గుంటుపల్లి, అడవిలోపల్లి, మెట్లవారిపాలెం, తురకపల్లి, శంకరాపురం, మాలకొండ అడవుల్లో వైట్‌క్వార్ట్జ్ నిక్షేపాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో తెల్లఖనిజం ఎక్కువగా లభిస్తుంది. దీన్ని అక్రమార్కులు ఇష్టానుసారం ఎక్స్‌కవేటర్లతో తవ్వి రవాణా చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఎక్కడ పడితే అక్కడ మైనింగ్ చేస్తున్నారు.

కొంత..క్వారీయింగ్ మరింత :

కొందరు నామమాత్రంగా కొంత భూమిని లీజుకు తీసుకొని దాని పేరుతో అంతకు రెండింతలు తవ్వుకొని లక్షలు గడిస్తున్నారు. తవ్విన రాయిని రాత్రి సమయంలో నెల్లూరు మీదుగా సూళ్లూరుపేటకు, సీఎస్‌పురం మండలంలోని కోవిలంపాడు ఫ్యాక్టరీలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. తెల్లరాయిపై అనుమతులు ఉన్న నెల్లూరు, కర్నూలు ప్రాంతాలకు - మిగతా 2 లో

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్
- ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి మార్క్ ఫైడ్
- జూన్ రెండో వారంలో కొనుగోలు ప్రారంభం
- ఎట్టకేలకు ఫలించిన ఎమ్మెల్యే ఏలూరి కృషి
- ప్రిన్సిపల్ సెక్రటరీతో ఫోన్లో మాట్లాడిన మంత్రి గొట్టిపాటి

విశాలాంధ్ర - యద్దనపూడి : నల్లబర్లీ పొగాకు రైతుల సమస్యలపై గట్టు పట్టు వదలని విక్రమార్కుడిలా కృషిచేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రయత్నాలు ఎట్టకేలకు ప్రయత్నాలు ఫలించాయి. జూన్ రెండో వారం నుంచి నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మార్క్ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్‌తో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భేటీ అయ్యారు. పొగాకు సమస్య తీవ్రంగా ఉందని తక్షణమే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే అంశంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రిన్సిపల్ సెక్రెటరీతో ఫోన్లో మాట్లాడారు. పొగాకు కొనుగోలుకు శ్రీకారం చుట్టాలని కోరారు. రేపు క్యాబినెట్లో సైతం పొగాకుపై మిగతా 2 లో...

గెలుపోటములు సహజం..క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలి

జిల్లా ఎస్పీ దామోదర్

విశాలాంధ్ర-ఒంగోలు : క్రీడాస్ఫూర్తితో ఆటల్లో పాల్గొనాలని, గెలుపోటములు ముఖ్యం కాదని జిల్లా ఎస్పీ తెలిపారు. శాంతి భద్రతలను కాపాడడంలో నిరంతరం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది కోసం, వారిలో ఉత్సాహాన్ని మరియు క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పెరేడ్ గ్రౌండ్‌లో ఒంగోలు, దర్శి, మార్కాపురం, కనిగిరి, ఆర్మడ్ రిజర్వ్, స్వాట్ టీం మరియు ఐటి కోర్ 7 జట్లకు నిర్వహిస్తున్న ఎస్.పి ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌ను జిల్లా ఎస్పీ దామోదర్ ప్రారంభించి క్రికెట్ మ్యాచ్‌లను ఆసక్తిగా తిలకించారు. టోర్నమెంట్‌లో పాల్గొంటున్న క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. ఎస్పీ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుఢ్యం పెంపొందు తుందన్నారు. క్రికెట్ అంటే అది కేవలం క్రీడ మాత్రమే కాదని గ్రహించాలని, జట్టును స్ఫూర్తిమంతంగా నాయకత్వ లక్షణాలతో నడిపించడానికి ఇది ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఈ మ్యాచ్‌లలో ఎస్పీ చేతుల మీదుగా ట్రోఫీలు మరియు ఉత్తమ ఆటగాళ్లకు ప్రత్యేక గుర్తింపుతో మెమెంటోలు ఇవ్వబడ్డాయి. ఈ టోర్నమెంట్ లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, డిఎస్పీలు శ్రీనివాసరావు, లక్ష్మి నారాయణ, సాయి ఈశ్వర్ యశ్వంత్, నాగరాజు, శ్రీనివాసరావు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

70 శాతం హామీలు అమలు

- టీడీపీ ఏడాది పాలనలోనే మెరుగైన పనితీరు
- గతంలో రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్
- చంద్రబాబు లోకేష్ నేతృత్వంలో అభివృద్ధిలో రాష్ట్రం
- జగన్ ఉనికి కోసం పాకులాట
- బాపట్ల టీడీపీ జిల్లా అధ్యక్షులు సలగల రాజశేఖర్‌బాబు



విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలోనే రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 70 శాతం హామీలు అమలు చేశామని టీడీపీ జిల్లా అధ్యక్షులు బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు తెలిపారు. ఆయన కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ జగన్ గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. రాజధాని లేకుండా అభివృద్ధి మరచి తనకు ఇష్టం వచ్చినట్లు నియంతలా పరిపాలన సాగించారన్నారు. దీంతో రాష్ట్రంలో ఆర్థికంగా వెనకబడి పెట్టుబడులు రాక ఇబ్బందులు పడ్డారన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాతరం ఏడాది కాలంలోనే పాలనలో ఎన్నో విప్లవాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ పెట్టుబడులు రాష్ట్రానికి తెచ్చే విధంగా నిరంతరం పని చేస్తున్నారన్నారు. జగన్ చేసిన అరాచక పాలనకు ప్రజలకు 11 సీట్లకే పరిమితం చేస్తే రాజకీయ ఉనికి కోసం జగన్ పాకులాడుతున్నారన్నారు. వెన్నుపోటు రాజకీయాలలో జగన్ సిద్ధహస్తుడని మండిపడ్డారు. గంజాయి ముఠాను పరామర్శించడానికి జగన్ తెనాలి రావడం సిగ్గుపడాల్సిన అంశమని పరామర్శ పేరుతో జగన్ కులాల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలు అమలు చేశామన్నారు. అధికారం చేపట్టిన మొదటి నెలలోనే రూ. 4వేలు పింఛన్ పెంచి అమలు చేశామని నెలకు రూ.2720 కోట్లు - మిగతా 2 లో

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు : హరిత శోభిత ప్రకాశం జిల్లా అవిష్కరణే లక్ష్యంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టరు ఏ.తమీమ్ అన్సారియా పిలుపువిచ్చారు. సంబంధిత శాఖలు సమన్వయంతో వివిధ వర్గాలను ఇందులో భాగస్వామ్యం చేయాలని చెప్పారు. 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని "వనం- మనం" కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒక కోటి మొక్కలు నాటాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిన నేపథ్యంలో జిల్లాలో ఈ కార్యక్రమం అమలుపై మంగళవారం ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఎఫ్ఓ (సోషల్ ఫారెస్ట్) రాజశేఖర్ మాట్లాడుతూ 5వ తేదీన ప్రకాశం జిల్లాలో 4 లక్షల 10 వేల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టిందన్నారు. జూన్ నుంచి నవంబర్ వరకు 6 నెలల వ్యవధిలో జిల్లాలో 35 లక్షల 76 వేలకు పైగా మొక్కలు నాటాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 36 శాతం అటవీ విస్తీర్ణం వున్నదని, దీనిని 50 శాతానికి పెంచేలా ఈ కార్యక్రమం చేపట్టాలని నిర్దేశించిందన్నారు. పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తూ "ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ గ్లోబల్లీ" అనే ఇతివృత్తంతో ఈ నెల 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనిపై కలెక్టరు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెప్పారు. కేవలం మొక్కలు నాటడం మాత్రమే కాకుండా 'వనం-మనం' కార్యక్రమ వాస్తవ స్ఫూర్తితో వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాల్సి వుంటుందన్నారు. పాఠశాలలు, కాలేజీలు, విద్యా సంస్థలలో విస్తృత స్థాయిలో వీటిని నాటేలా చూడాలన్నారు. సంబంధిత శాఖలకు నిర్దేశించిన లక్ష్యం మేరకు నాటేలా మొక్కలను సరఫరా చేయాలని హార్టీకల్చర్, అటవీ శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస రావు, ఉద్యాన అధికారి గోపి చంద్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రాఘవరెడ్డి, డ్వామా ఏపీడీ వందర్ మాన్, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పరిశ్రమల సంస్థ జీఎం శ్రీనివాస రావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, బీసీ సంక్షేమ అధికారి అంజల, డీపీఓ గొట్టిపాటి వెంకట నాయుడు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్, జిల్లా ఉప విద్యాధికారి చంద్ర మౌళి, జిల్లా పరిషత్, ఒంగోలు మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు పాల్గొన్నారు.

70 శాతం హామీలు అమలు

(మొదటిపేజీ తరువాయి)

ఏడాదిలో రూ.34 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. 16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి మొదటి సంతకం మాట నిలబెట్టుకున్నామన్నారు. అదేవిధంగా దీపం-2 కింద 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తూ ఆడబిడ్డలకు అండగా ఉండే ప్రభుత్వం అని నిరూపించుకున్నామన్నారు. ఏడాదికి రూ.2684 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. గత ఐదేళ్లలో గుంతమయం అయిన రోడ్లను పూడ్చే కార్యక్రమం చేపట్టి ఇప్పటికి రూ.1200 కోట్లు ఖర్చు చేసి 20 వేల కిలో మీటర్ల మేర రోడ్లు బాగుచేశామన్నారు.మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే 217 జీవో రద్దు చేశామని మత్స్యకారుల సేవలో పథకం ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయం కింద రూ.259 కోట్లు అందజేశామని తెలిపారు. పేదల కడుపు కొట్టిన జగన్ సర్కార్ నియంతలా మూసివేసిన 203 అన్న క్యాంటీన్లు తెరిచి నిత్యం 5 రూపాయలకే ఆకలి తీరుస్తున్నామన్నారు. ప్రజలపై వేసిన చెత్త పన్ను రద్దు చేశామన్నారు. ధాన్యం రైతులకు గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1674 కోట్లు విడుదల చేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రూ.990 కోట్లు పంచాయతీలకు కేటాయించినట్లు తెలిపారు. రూ.4500 కోట్లతో గ్రామాల్లో30 వేల పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అధికారంలోకి వచ్చి తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలు చేసిన ప్రభుత్వం మరొకటి లేదన్నారు. సంక్షేమం -అభివృద్ధి సమపాలనలో చేస్తున్న నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు.జగన్ కంటికి ఇవేమి కనపడనట్లు ప్రజలను మభ్య పెట్టేందుకు వెన్నుపోటు దినం అని టీడీపీపై అసత్య ప్రచారాలకు తెరతీశారన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని నీ నాటకాలు ఈ రాష్ట్రంలో చెల్లవనే విషయం గుర్తించుకోవాలన్నారు.

కొత్తగొల్లపాలెంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ జె.వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : కొత్తగొల్లపాలెం, చిన్నగంజాం మండలం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని వీక్షణ సమావేశ మందిరంలో అభివృద్ధి పనులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ ఒకటవ తేదీన నిర్వహించిన పి4 కార్యక్రమంలో భాగంగా ఎంపిక కాబడిన చిన్నగంజాం మండలంలోని కొత్తగొల్లపాలెం గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ఆ గ్రామంలో ప్రజలు కోరిన సదుపాయాల గురించి వాటి పురోగతిపై ఆయన అధికారులను ఆరా తీశారు. గృహ నిర్మాణాల కొరకు 42 మంది, ఇళ్ల స్థలాల కొరకు 13 మంది దరఖాస్తు చేసుకున్నారని వారికి పొజిషన్,కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు చిన్నగంజాం తహసిల్దార్ జిల్లా కలెక్టర్కు వివరించారు. గృహ నిర్మాణాలకు సంబంధించి దరఖాస్తుదారుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేసినట్లు గృహ నిర్మాణ సంస్థ అధికారి ప్రసాద్ కలెక్టర్కు వివరించారు. గ్రామంలో 17 మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు అందాయని వాటిలో 2 పూర్తి చేశామని మిగిలిన పనులు జరుగుచున్నాయన్నారు. 304 ట్యాప్ కనెక్షన్లను జలజీవన్ మిషన్ పథకం ద్వారా పూర్తి చేయుటకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గ్రామంలో 4.48 కిలోమీటర్ల అంతర్గత సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లు కొరకు నిధులు మంజూరైయాయని, ఈ పనులను త్వరలో ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ ఎస్.ఈ జిల్లా కలెక్టర్కు వివరించారు. పర్చూరు నియోజకవర్గంలో ఆరు విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలకి 25 కోట్లు ఖర్చు అవుతుందని వీటికి సంబంధించి ప్రతిపాదనలు సమర్పించడమైనదని ఏపీ ఎస్పీడీసీఎల్ ఈఈ కలెక్టర్ కు వివరించారు. 5 కుటుంబాలు రేషన్ కార్డుల కొరకు దరఖాస్తు చేసుకున్నారని వాటికి సంబంధించి మంజూరుకు చర్యలు తీసుకోవడమైనదని పౌర సరఫల అధికారి కలెక్టర్కు వివరించారు. బాపట్ల పురపాలక సంఘ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న నూతన భవన పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తి అవుతాయని సర్వ శిక్ష అభియాన్ అధికారి కలెక్టర్కు వివరించారు. కొత్త గొల్లపాలెం అభివృద్ధి పనులను అధికారులందరూ చిత్తశుద్ధితో పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాసరావు, గృహ నిర్మాణ సంస్థ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్ డబ్ల్యు ఎస్ఎస్.ఈ అనంతరాజు, పిడి డ్వామా విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, ఏపీ సీపీడీసీఎల్ ఈఈ మల్లికార్జున రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి విలియమ్స్,సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దెబోరా, చిన్నగంజాం తహసిల్దార్ ప్రభాకర్, వీక్షణ సమావేశం ద్వారా సర్వ శిక్ష అభియాన్ అధికారి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తరలిపోతున్న తెల్ల రాయి

(మొదటిపేజీ తరువాయి)

చెందిన వారి పేర్లతో ఎక్కువగా ఇక్కడి అధికార పార్టీ నేతలు క్వారీయింగ్ చేస్తున్నారు. అక్రమంగా తరలించిన రాయిని ఆయా ఫ్యాక్టరీలు పొడిగా మార్చి విదేశాలకు ఎగుమతి చేస్తారు.

మురుగమ్మ ప్రాంతంగా అక్రమ రవాణా :

మండలంలోని పేరంటాలమ్మ గుడి సమీపంలో రెవెన్యూ ఫారెస్ట్ బంజర భూములలో అక్రమార్కులు ఇష్టానుసారంగా తెల్లరాయి తవ్వకాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్స్‌వేటర్ల సహాయంతో రేయింబగుళ్ళ అక్రమంగా తరలిస్తున్నా రెవెన్యూ ఫారెస్ట్ మైనింగ్ శాఖల అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. నెలవారీగా భారీ స్థాయిలో మామూళ్లు వెళుతుండటమే అధికారులు ఆవైపు కన్ని ఎత్తి కూడా చూడటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తెల్లరాయికి గిరాకీ :

జిల్లాలోని పశ్చిమప్రాంతంలో తెల్లరాయి ఎక్కువగా దొరుకుతోంది. మార్కాపురం,

గిద్దలూరు, కందుకూరు, ఎర్రగొండపాలెం, కనిగిరి తదితర ప్రాంతాల్లో తెల్లరాయి ఖనిజం విస్తారంగా ఉంది. అయితే కనిగిరి ప్రాంతంలో దొరికే ఏగ్రేడ్ తెల్లరాయికి విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. కనిగిరి పామూరు పీసీపల్లి మండలాల్లోని ఏ గ్రేడ్ రాయి దొరుకుతుంది. ఇది జపాన్, రష్యా, సింగపూర్, ఇండోనేషియా దేశాలకు ఎగుమతి అవుతోంది. తెల్లరాయిని (సిరామిక్) టైల్స్ కోసం పలురకాల మందుల తయారీకి వినియోగిస్తారు. మొదటి రకాన్ని కంప్యూటర్, ఎల్ఈడీ, ఎల్‌సీడీ స్క్రీన్‌ల తయారీకి వాడతారు. విడి పరికరాలు షోకాప్సుల్లో పెట్టుకునే బొమ్మలు చేతి గడియారాలు, గాజుల తయారీలోనూ వినియోగిస్తారు.

పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు

మండలంలో మురుగమ్మి కేంద్రంగా తెల్లరాయి అక్రమంగా తరలిపోతున్నా సంబంధిత శాఖల అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా తరలిపోతున్న తెల్లరాయి రవాణాను అడ్డుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దారును 'విశాలాంధ్ర' వివరణ కోరగా రెవెన్యూ భూములలో అక్రమంగా తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అక్రమ తెల్లరాయి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి అధికారులను పంపించినట్లు 'విశాలాంధ్ర'కు తెలియజేశారు.

వాహనాలు స్వాధీనం : అక్రమ తవ్వకాల నియంత్రణలో భాగంగా మంగళవారం రాత్రి మార్కాపురం మైనింగ్ ఏడీ ఆధ్వర్యంలో మైనింగ్ అధికారులు పీసీపల్లి తహసీల్దార్, వీఆర్ఓ సంఘటన స్థలాన్ని సందర్శించి ఎక్స్‌వేటర్, టిప్పర్ స్వాధీనం చేసుకున్నారు.

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

చర్చిస్తామన్నారు.దీనికి స్పందించిన ప్రభుత్వం జూన్ రెండో వారంలో పొగాకు కొనుగోలుకు రంగం సిద్ధం చేసింది. మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సుముఖత వ్యక్తం చేసింది. ఇప్పటికే రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా మార్కెటింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందించనున్నారు. పర్చూరు,ఇంకొల్లు,మార్టూరు మార్కెట్ యార్డులలో మార్క్ ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

పంట మార్పిడి దిశగా రైతులు :

రైతాంగం స్వచ్ఛందంగా పంట మార్పిడి దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేందుకు సిద్ధమయ్యారని ఎమ్మెల్యే ఏలూరి ప్రిన్సిపల్ సెక్రెటరీ వివరించారు. సాగు విస్తీర్ణం పెరగడం,పంట దిగుబడి రావడం ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే ఏలూరి వివరించారు. ఇప్పటికే రైతులతో పలుమార్లు చర్చించామని పంట మార్పిడికి రైతాంగం సుముఖంగా ఉన్నారని ఈ ఏడాది రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి కోరారు.రైతులు అధిక పెట్టుబడులు తెచ్చి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు.

కంపెనీల కొనుగోలు లేక :

ప్రభుత్వం ప్రతినిత్యం పొగాకు కొనుగోలుపై మానిటరింగ్ చేస్తున్న అనుకున్న స్థాయిలో కంపెనీలు పొగాకు కొనుగోలుకు ముందుకు రావడంలేదని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.ఇప్పటికే ప్రభుత్వం పొగాకు కొనుగోలు సంబంధించి మోనిటరింగ్ సెల్ ఏర్పాటు చేసిందని,కంపెనీలు కొనుగోలులో ఎలాంటి పురోగతి లేదని వెల్లడించారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.ప్రతి రైతుకు న్యాయం చేసేలా పొగాకు కొనుగోలు చేసేందుకు విస్తృత అధికారాలు వినియోగించనున్నారు. ఉద్యోగ విరమణ చేసిన టుబాకో బోర్డు అధికారులు,ఇతర కంపెనీల ప్రతినిధులు, నిపుణుల సర్వీసును వినియోగించుకోనున్నారు.

విత్తనాలపై కఠిన నిర్ణయం :

మార్కెట్ డిమాండ్ కంటే అత్యధికంగా పంట నిల్వ ఉన్న నేపథ్యంలో రైతుల నష్టపోకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. నల్లబర్లీ విత్తనాలు సరఫరా చేసే ఐటిసి,రాజమండ్రి సిటిఆర్ఐలలో అందుబాటులో లేకుండా చర్యలు తీసుకోనుంది.

కంపెనీలతో ఒప్పందం లేకుండా పంటలు సాగు చేయం

ఒక కంపెనీల ఒప్పందం లేకుండా పంటలు వేయబోమని రైతులు తేల్చి చెప్తున్నారు.భవిష్యత్తులో కంపెనీలతో ఒప్పందం చేసుకుంటేనే పంటలు సాగు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.ఇప్పటికే రైతాంగం కంపెనీల ఒప్పందం లేకుండా పంటలు సాగు చేయమని ప్రకటించారు.అనేక మంది రైతులు ఈ అంశంపై ముందుకు వస్తున్నారు.తద్వారా పంట కొనుగోలు సమయంలో రైతులకు ఇబ్బందులు తప్పనున్నాయి. భవిష్యత్తులో రైతులకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ భాగస్వామ్యం చేయనున్నారు. రైతుల భాగస్వామ్యంతో కమిటీలు వేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

12న బ్రిలియంట్ ఎడ్యుకేషన్ 'మెగా ఫెయిర్- 2025'

విశాలాంధ్ర-ఒంగోలు : ఈ నెల 12వ తేదీన ఒంగోలులోని ఎవన్ ఫంక్షన్ హాలులో జరుగనున్న జాతీయ స్థాయి బ్రిలియంట్ ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్ 2025కి సంబంధించిన బ్రోచర్‌ని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. దీనికి సంబంధించి బ్రిలియంట్ కంప్యూటర్ సంస్థ అధినేత డాక్టర్ షేక్ న్యామత్ మాట్లాడుతూ గత 21 సంవత్సరములుగా బ్రిలియంట్ జిల్లా లోని విద్యార్థుల శ్రేయస్సు కోసం ప్రతి సంవత్సరం ఉచితంగా మెగా ఫెయిర్ నిర్వహిస్తున్నామని దీని వలన ఎంతో మంది విద్యార్థులు ఎన్నో విధాలుగా లబ్ధి పొందుతూ తమ ఉజ్వల భవిష్యత్ కి బాటలు వేసికొంటున్నారని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం కూడా ఇంజనీరింగ్, మెడికల్, డిగ్రీ కాలేజీల్లో చేరబోయే విద్యార్థులకు వెబ్ కౌన్సిలింగ్‌పై అవగాహన కల్పించడంతో పాటు, స్పెషల్ కోర్సులుతో పాటు, కెరీర్ గైడేన్స్ కూడా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మెగా ఫెయిర్‌లో గౌరవనీయులు డిస్ట్రిక్ట్ కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా, డి.జి.పి. కె.ఆర్.ఎం. కిషోర్ కుమార్, యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లు, పేరెన్నికగన్న యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కళాశాలలో పని చేస్తున్న ప్రిన్సిపాల్స్, డైరెక్టర్స్, ప్రొఫెసర్స్, మరికొందరు ప్రముఖులు, బ్యాంకర్స్ పాల్గొని, తమ అమూల్యమైన సందేశములు అందించనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ సంస్థ ఎం.డి. డాక్టర్ తోహారా, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. లక్కీ డీప్ ద్వారా లాప్ టాప్ లను అందిస్తామని, ఎంట్రీ పాస్‌ల కోసం, ఫ్రీ బస్సుల కోసం, బ్రిలియంట్ కంప్యూటర్ సెంటర్, ఒంగోలు - 80194 79999 నెంబర్‌కి కాల్ చేసి పొందవచ్చని తెలిపారు.

ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు

ఇంఛార్జి ఎంపీడీవో ప్రభాకర్ శర్మ

విశాలాంధ్ర-పిసీపల్లి : ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో జరుగుతున్న పనులలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇన్చార్జి ఎంపీడీవో ప్రభాకర్ శర్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇన్చార్జి ఏపీఓ జహింగీర్ భాష ఆధ్వర్యంలో టిఏ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కొన్ని ఫిర్యాదులు వచ్చాయని పనులకు రాకుండా వచ్చినట్లు బోగస్ మస్టర్లు వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా కూలీలు పనులకు రాకుండా వచ్చినట్లు మస్టర్ వేస్తే క్షేత్ర సహాయకులపై చర్యలు తప్పవన్నారు. అలానే ఉపాధి పనులను పర్యవేక్షించే సిబ్బంది ప్రతి రోజూ పనులను పరిశీలించాలన్నారు. ఎక్కడైనా ఎవరైనా పనులలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసు కుంటామన్నారు. లక్ష్యం మేరకు కూలీలకు పనులు కల్పించాలన్నారు. రోజు కూలి రూ.300 తగ్గ కుండా పనులు చేయాలన్నారు. సిబ్బంది నగదు కోసం ఒత్తిడి తెస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈనెల 5 నుంచి జరిగే అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయిలో అన్ని గ్రామ పంచాయతీలలో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో ప్రభాకర్ శర్మతోపాటు ఇన్చార్జి ఏపిఓ జహీర్ బాషా టెక్నికల్ అసిస్టెంట్స్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రామచంద్ర యాదవ్ అంటే భయమెందుకు?

మిరియం శ్రీనివాసులు

విశాలాంధ్ర-ఒంగోలు : నిరుద్యోగ యువతీ యువకుల సమస్యలపై పోరాడుతున్న భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్‌ని చూచి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎందుకు భయపడుతున్నారని 139 బీసీ కులాలు జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ప్రశ్నించారు. విజయవాడ నందు నిరుద్యోగ సమస్యపై ధర్నాలో ప్రసంగించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయటానికి వెళుతుండగా సత్యనారాయణపురం సిఐ దురుసుగా ప్రవర్తించటం దారుణమని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం కూని చేయబడిందని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా రామచంద్ర యాదవ్‌కి మద్దతుగా సభలు సమావేశాలు ఏర్పాటు చేసి బీసీ నాయకునిపై ప్రభుత్వ అండతో దురుసుగా ప్రవర్తించిన సీఐని సస్పెండ్ చేయాలని రాష్ట్రవ్యాప్తంగా రాజ్యాంగం ప్రకారం పోలీసులు వ్యవహరించటం లేదని ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమం నిర్వహిస్తామని శ్రీనివాసులు తెలిపారు. పోలీసులే నడి బజార్లో వీధి రౌడీల వ్యవహరించటం ఏమిటి అని ప్రశ్నించారు. చట్టం తన చేతుల్లో ఉంది కదా అని పోలీసులు విచక్షణ రహితంగా చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని రాష్ట్రంలో ఇటీవల కాలంలో పోలీసుల తీరు దారుణంగా ఉన్నదని చట్టాన్ని లెక్కచేయకుండా అధికార పార్టీ నాయకుల మెప్పుకోసం కొంతమంది పోలీస్ అధికారులు వ్యవహరిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని శ్రీనివాసులు అన్నారు.పది రోజులలో సత్యనారాయణపురం సిఐ ని సస్పెండ్ చేయకపోతే ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర భారీ ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించి కేంద్ర పెద్దలకు రాష్ట్ర పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై వినతి పత్రం సమర్పిస్తామని తెలిపారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మలేరియా మా ఉత్సవాలు సందర్భంగా మండల కేంద్రమైన కొనకనమిట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ఎస్పీ బాలయ్య ఆధ్వర్యంలో ఆరోగ్య ఆశా కార్యకర్తలు ఎం ఎల్ పి హెచ్ లు వైద్య సిబ్బంది మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎస్పీ బాలయ్య మాట్లాడుతూ అందరూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ కాటు వలన మలేరియా డెంగు వంటి వ్యాధులు సంక్రమిస్తాయని జ్వరం వచ్చి రెండు, మూడు రోజులు తగ్గకపోతే వెంటనే డాక్టర్ను సంప్రదించాలని కోరారు. పొదిలి మలేరియాసబ్ యూనిట్ అధికారి కృష్ణ మాట్లాడుతూ ఇండ్లలో నీటి తొట్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, కొబ్బరి బోండాలు పాత టైర్లు ఇంటి సమీపంలో లేకుండా చూసుకోవాలని దోమకాటు గురికాకుండా దోమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ టి ప్రతాపరెడ్డి ,ఆరోగ్య ,ఆశా కార్యకర్తలు ఎంఎల్‌పిహెచ్, పీహెచ్ఎన్ శైలజ పాల్గొన్నారు.

మలేరియా నివారణలో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున కీటక జనక వ్యాధులైన మలేరియా. డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యాధికారి సిహెచ్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిలో నీటి నిల్వలు లేకుండా చేసి ఎండబెట్టు కోవాలన్నారు. ఇంటి చుట్టుప్రక్కల కాలువలో, ఖాళీ ప్రదేశాలలో శుభ్రంగా ఉండే విధంగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ డి వెంకటరావు, హెల్త్ ఎడ్యుకేటర్ కే అప్పలరాజు, హెల్త్ సూపర్వైజర్ ఏ అంజమ్మ, ఆయుష్మాన్ భారత్ సిహెచ్ఓలు, ఆషాలు పాల్గొన్నారు.

'క్విస్'లో ఉద్యోగాల వర్షం

- 928 మందికి క్యాంపస్ ఉద్యోగాలు
- ప్రత్యేక శిక్షణ, నైపుణ్యశిక్షణ వల్లే సాధ్యమంటున్న యాజమాన్యం
- విద్యార్థులకు సన్మానం

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్లేస్ మెంట్ సక్సెస్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 928 మందికి ప్లేస్ మెంట్స్ వచ్చాయని, ఇది చాలా గర్వకారణం అని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి తెలియజేశారు. ఈ సందర్భంగా ప్లేస్ మెంట్ సక్సెస్ మీట్ నిర్వహించి విద్యార్థులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా ప్లేస్ మెంట్స్ సాధించిన విద్యార్థులకు అత్యంత వైభవంగా కళాశాలలోకి స్వాగతం పలికారు. అనంతరం అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రైనెట్ జీసిఇ కార్పొరేట్ కంపెనీ ప్రతినిధి అరుణ్ కుమార్ శుభనవీస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంతమందికి ప్లేస్ మెంట్స్ రావడం రికార్డ్ అని కొనియాడారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్‌లో ఉద్యోగాలు రావడం అంత ఈజీ కాదని, క్విస్ విద్యార్థులకు మొదటి నుంచి ఇస్తున్న స్పెషల్ ట్రైనింగ్ వల్లే ఇది సాధ్యం అయిందని చెప్పారు. పెద్ద పెద్ద యూనివర్సిటీలు, కాలేజీలకి రానన్ని ప్లేస్ మెంట్స్ మీకు వచ్చాయంటే మీకు ఎంత ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారో అర్థం అవుతుందని చెప్పారు. భవిష్యత్తులో మీలాంటి క్విస్ కాలేజి విద్యార్థులకు మరిన్ని ఉద్యోగాలు వస్తాయని, ఇచ్చేందుక కచ్చితంగా చాలా కంపెనీలు ముందుకు వస్తాయని ఆయన చెప్పారు. అనంతరం మాట్లాడిన క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ నిడమానూరి శ్రీ గాయత్రి విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఇన్ని ప్లేస్ మెంట్స్ సాధించడం గర్వకారణం అని ఆమె అన్నారు. విద్యాసంస్థల అధినేత సూర్య కల్యాణ్ చక్రవర్తి విజన్‌తో ఎన్నో ప్రత్యేక కోర్సులు, ప్రత్యేక కరిక్యులమ్ ఏర్పాటు చేశారని, దాని ఫలితం ఈ రోజు కళ్ల ముందు కనిపిస్తుందని ఆమె అన్నారు. విద్యార్థులు, ఫ్యాకల్టీ, హెచ్ వోడీలు, ముఖ్యంగా ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ సెల్ వాళ్ల కృషి ఫలితంగా 928 ఉద్యోగాలు సాధించామని ముందు ముందు ఇంకా మరిన్ని ఉద్యోగాలు, అద్భుతమైన ప్యాకేజ్‌తో రావాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్లేస్ మెంట్ సెల్ డీన్ డాక్టర్ జగదీశ్, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, క్విస్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిశోర్ బాబు, హెచ్ వోడీలు, డీన్ లు, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వాళ్లంతా ఉద్యోగాలు వచ్చిన విద్యార్థులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రతి విద్యార్థి అభ్యున్నతే లక్ష్యం

- డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి, క్విస్ విద్యాసంస్థల అధినేత

ప్రతి విద్యార్థి అభ్యున్నతే లక్ష్యంగా క్విస్ విద్యాసంస్థలు పనిచేస్తున్నాయి. ప్రకాశం జిల్లా వాసులకు ఉత్తమ విద్య అందిచడం, వారంతా ఉన్నత స్థానాల్లో ఉండాలనే ధ్యేయంతో ఆయన విద్యాసంస్థలను ప్రారంభించాము. అలానే కొత్త కొత్త కోర్సులు, కొత్త కొత్త విధానాలను ప్రవేశపెట్టి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాము. దాంట్లో భాగంగానే ప్రతి ఒక్క విద్యార్థి ఉద్యోగం తెచ్చుకునేందుకు వీలుగా వారికి శిక్షణ అందించాలనే ఉద్దేశంతో క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆయన ప్రత్యేకమైన ట్రైనింగ్ ఇచ్చేలా కరిక్యులమ్‌ని రూపొందించాము. ప్రైమ్ బ్యాచ్ లు నిర్వహిస్తూ ఉద్యోగాలు తెచ్చుకునేందుకు, ఉద్యోగం వచ్చిన తర్వాత ఉపయోగపడే విధంగా స్కిల్స్ విద్యార్థులకు అందేలా నైపుణ్య శిక్షణ అందేలా కోర్సులు రూపొందించాము. దాని ఫలితమే రికార్డు స్థాయి ప్లేస్ మెంట్లు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com బుధవారం 04 । జూన్ । 2025

5న బండలాగుడు పోటీలు

విశాలాంధ్ర-సిఎస్‌పురం : మండల కేంద్రమైన సిఎస్ పురం గ్రామంలో రాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ళ మహోత్సవము సందర్భంగా కాపు నాయుడ్లు ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన నిర్వహిస్తున్న బండలాగుడు పోటీల కరపత్రాలను మంగళవారం కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు సోదరులు కదిరి ప్రకాశ్ రావు, పార్థసారథిలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ పురం ఎంపిటిసి మన్నెపల్లి పెద్దన్న,మన్నెపల్లి రవికుమార్, మాజీ ఎంపిటిసి మూరం కాశిరెడ్డి,మునగల నారాయణ రెడ్డి, ఇరగని చలపతి రావు,పట్నం తిరుపతయ్య, నిమ్మల శ్రీనివాసులు, ఖాసీం భాష,మాధవ రావు,మహేశ్వర రావు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో 'ఆకుపాటి'

విశాలాంధ్ర-పామూరు : విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గ మల్లీశ్వరి స్వామిని ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శేష వస్త్రం వేద అశ్వర్వచనం తీర్థ ప్రసాదాలు వెంకటేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గద్దె సుధాకర్, బండ్ల నారాయణ, గాడి మహేంద్ర, ఇండ్ల నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో కాలిపోయిన పూరి గుడిసె

బాధిత కుటుంబానికి టీడీపీ నేతల సాయం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆదేశాల మేరకు యర్రగొండపాలెం పట్టణంలోని గాయత్రి హాల్ నందు ఓ నిరుపేద కుటుంబం నివసిస్తున్న వారి పూరి గుడిసె ప్రమాదవశాత్తు కాలిపోయిన ఘటన తెలుసుకున్న మండల టీడీపీ నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి నూతన గృహ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా వారికి నిత్యావసర సరుకులు, కూరగాయలతో పాటు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, క్లస్టర్ ఇంచార్జ్, కంచర్ల సత్యనారాయణ గౌడ్, మంత్రు నాయక్, మాజీ పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, పట్టణ అధ్యక్షులు పెరుమాళ్ళ మల్లికార్జున, గోళ్ళ సుబ్బారావు, చీదేళ్ళ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పూల సుబ్బయ్య, మెడబలిమి అచ్యుతరావు, దొంతా వెంకట్రావు గౌడ్, యక్కలి తిమ్మయ్య, అటుకూరి కిష్టయ్య, పువ్వాడ శ్రీను, మేడం కిరణ్, కొల్లా ధనవంతు, 3వ వార్డు మెంబర్ చేదూరి కిషోర్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శిగా 'శ్రీరామ్'

పలు తీర్మానాలు ఏకగ్రీవం

విశాలాంధ్ర-ఒంగోలు : సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శిగా శ్రీరామ్ శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఐ ఒంగోలు నగర మహాసభ ఒంగోలు నగరంలోని మల్లయ్య లింగం భవన్‌లో జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఎమ్మెల్యే నారాయణ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు హాజరైనారు. మహాసభలో నగర సమితి సభ్యులుగా 33 మందితోటి నగర సమితిని, ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా కొత్తకోట వెంకటేశ్వర్లు, ఆహ్వానితులుగా 9 మందిని గౌరవ ఆహ్వానితులుగా 7 మందిని ఎన్నుకోవడం జరిగింది. సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి గా శ్రీరామ శ్రీనివాసరావు ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మహాసభ క్రింది తీర్మానాలను ఆమోదించింది.

తీర్మానాలివే.. ఒంగోలు నగరానికి రోజువారి మంచినీటి సరఫరా చేయాలని, గత ప్రభుత్వం ఇచ్చిన ఒక సెంటు ఇళ్ల స్థలాలను రెండు సెంట్లుగా మార్చి ఇవ్వడంతో పాటు ప్రభుత్వమే గృహ నిర్మాణాలు చేయాలని, రిమ్స్ హాస్పటల్లో డాక్టర్ల కొర తను. మందుల కొరతలను ఇతర స్టాఫ్ ను నియమించి వైద్య నిర్ధారణ పరికరాన్ని కొనుగోలు చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, టిట్కో ఇండ్ల లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు ప్రభుత్వమే చెల్లించి లబ్ధిదారులకు ఇల్లు స్వాధీనం చేయాలని, నగరంలో విద్యారంగాన్ని సంస్కరించి ప్రైవేటు విద్యాసంస్థలలో కూడా పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని, ప్రభుత్వ రంగంలో ఉన్నటువంటి విద్యాసంస్థలను నడపడానికి నిధులతో పాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి విద్యను ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని, కాలేజీలలో అధిక ఫీజులు నేర్పించాలి మరియు క్వాలిటీ ఉపాధ్యాయులను నియమించి వారికి అన్ని ప్రభుత్వ నియమాలు వర్తించేలా తగు చర్యలు తీసుకోవాలని, నగరంలో ఈపాటికి ప్రభుత్వ భూములు గుడిసెలు వేసుకొని నివాసాలు ఉంటున్న దత్తాత్రేయ కాలనీ సరళ దేవినగర్ కార్మిక నగర్ వాసులకు వెంటనే పట్టాలు ఇచ్చి మౌలిక వసతులు ఏర్పాటు చేయటం ఇంకా పలు తీర్మానాలను ఈ మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించినది.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీకి సిద్ధం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని 64 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు మండలంకు చేరినట్లు ఎంఇఓ టి.రవి, ఇవి రమణయ్యలు తెలిపారు. మండలంలోని 64 ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరానికి గాన వచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పాఠశాలలకు పంపిణీకి సిద్ధం చేసినట్లు తెలిపారు. మొత్తం 3764 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్, యూనిఫామ్, బెల్ట్, డిక్షనరీలు మండల స్టాక్ పాయింట్‌కి చేరాయని వాటిని పాఠశాలల వారీగా ప్యాక్ చేసి పంపిణీ చేయడం జరుగుతుందని పాఠశాలలు ప్రారంభం రోజునే ప్రతి విద్యార్థికి కిట్‌లు అందించేలా చర్యలు చేపట్టమని విద్యా శాఖాధికారులు తెలిపారు.

అంకాలమ్మ దేవస్థానంలో కదిరి బ్రదర్స్ పూజలు

విశాలాంధ్ర - కనిగిరి: మండలం పరిధిలోని వంగపాడు గ్రామంలో అంకాలమ్మ తిరునాళ్ళ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బండ్లు పొంగళ్ళు కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు సోదరులు కదిరి ప్రకాశ్ రావు కదిరి పార్థసారథి లు అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కదిరి పిచ్చయ్య, కదిరి రమణయ్య, కదిరి కృష్ణ, మాజీ ఎంపిటిసి మునగల నారాయణ రెడ్డి, ఇరగాని చలపతి రావు, సుంకరి అంజనాద్రి, పట్నం తిరుపతయ్య, అడపా మధు, అన్నంగి రాఘవ, పాల్గొన్నారు.

'పువ్వాడి' వివాహ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-పామూరు : తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, వెంకట మహాలక్ష్మిల వివాహ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం స్థానిక పువ్వాడి లక్ష్మయ్య టవర్స్‌లో ఘనముగా నిర్వహించారు. ముందుగా పువ్వాడి కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు మధ్య పువ్వాడి వెంకటేశ్వర్ల దంపతులు కేక్ కట్ చేశారు. వార్షికోత్సవ వేడుకలలో ఒంగోలు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు ఏలూరు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ పువ్వాడి తిరుపతమ్మ, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు చౌదరి, పువ్వాడి రామకృష్ణ, పువ్వాడి రామారావు, పువ్వాడి బిల్డర్ వెంకటేశ్వర్లు, మండల తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య, పట్టణ టిడిపి అధ్యక్షులు ఇర్రి కోటిరెడ్డి, ఉపాధ్యక్షులు మెంటా నరసింహారావు, ఉప్పలపాటి హరిబాబు, వివిధ ప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి అడిషనల్ ప్రభాకర్ చౌదరి, షేక్ కాజా రహమతుల్లా, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పందిటి హరీష్, గుంటుపల్లి శ్రీనివాసులు తదితరులు వాడి వెంకటేశ్వర్లు దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రైవేటు కార్యక్రమంలో పందిటి హరీష్

విశాలాంధ్ర-పామూరు రూరల్ : తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు నూతన గృహప్రవేశం కార్యక్రమంలో మంగళవారం టిడిపి నాయకుడు మాజీ తెలుగు యువత అధ్యక్షుడు పందిటి హరీష్ పాల్గొన్నారు. అనంతరం పువ్వాడి దంపతులకు పందిటి హరీష్ స్వామివారి చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తడికమల సుబ్బారావు, పాలపర్తి వెంకటేశ్వర్లు, పానుగంటి చలపతి పాల్గొన్నారు.

మస్తాన్ మృతికి సీఐటీయూ సంతాపం

విశాలాంధ్ర-పామూరు : సిఐటియు మండల అధ్యక్షులు షేక్ మస్తాన్ మృతి (50) సిఐటియుకు తీరని లోటని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ అన్నారు. మండలంలోని ఎల్ ఎన్ పురం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ గత కొంత కాలం నుండి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కడపలో వైద్య పరీక్షలు పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొంతకాలము ప్రైవేట్ స్కూల్‌ని పెట్టి ఉపాధ్యాయు వృత్తిని చేపట్టారని తరువాత పట్టణంలోని కందుకూరు రోడ్లో మీ సేవను నిర్వహించారు. అనంతరం సిఐటియులో చురుకైన పాత్ర పోషిస్తూ కార్మికులకు అండగా ఉండి ఏ సమస్య వచ్చినా పరిష్కారం చేసి అండగా ఉంటున్నాడని అన్నారు.

శ్రీరాములోరి విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర -వెలిగండ్ల : మండలంలోని వెదుళ్ళ చెరువు గ్రామం నందు నూతనంగా శ్రీ పట్టాభిరామ స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవము ఘనంగా నిర్వహిస్తున్న వెదుళ్ళ చెరువు గ్రామస్తులు భక్తులందరూ పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు పొందారు. వేద పండితులు మంత్రోత్సవం నడుమ విగ్రహ ప్రతిష్ట అంగరంగ వైభవంగా నిర్వహించారు. 4వ తేదీ గొప్ప పౌరాణిక నాటక ప్రదర్శనలు1 భక్త చింతామణి లవ్ (శీను) బావ నీకు పాత్రలో నెల్లూరు గంగాధర్ రెడ్డి 2 శ్రీ రామాంజనేయ యుద్ధం శ్రీరామ పాత్రలో తరుణవాయి పెంచలయ్య శ్రీ ఆంజనేయ పాత్రలో పైడిరాజు విజయనగరం 3 సత్య హరిచంద్ర వారణాసి శీను నుండి కాటిసీను వరకు1 హరిచంద్ర పాత్రలో రామ బ్రహ్మ రెడ్డి ఒంగోలు రెండవ హరిచంద్ర బీరం శ్రీనివాస్ రెడ్డి అభినవ డివి చంద్రమతి పాత్రలో నెల్లూరు భానుమతి నక్షత్ర పాత్రలో జయరావు కావలి కాల కౌశిక పాత్రలో శేషయ్య కావలి శివుడి పాత్రలో రత్తయ్య ఒంగోలు గొప్ప కళాకారులచే గొప్ప పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహించబడతాయని వారన్నారు. కావున నియోజకవర్గంలోని ప్రజలందరూ తరలివచ్చి ఈ మహత్కరమైన ఉత్సవాలను విజయవంతం చేయాలని వెదల చెరువు గ్రామ పెద్దలు కోరడం జరిగినది.

పీఎండీఎస్ కిట్లు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - సంతమాగులూరు : ప్రకృతి సేద్యంలో భాగంగా 22 రకాల విత్తనాలతో తయారు చేసిన పీఎండీఎస్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏల్చూరులోని రైతు సేవా కేంద్రంలో తహశీల్దార్ రవిబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ శాఖ ఎల్-2 బొగ్గల అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పశువుల కొరత కారణంగా ఎరువుల తయారు తగ్గిపోయిందన్నారు.ఇందుకు ప్రత్యామ్నాయంగా పీఎండీఎస్ కిట్లు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఈ విత్తనాలు భూమిలో వేసిన తర్వాత,పూత దశలో దుక్కి చేయాలని చెప్పారు.తద్వారా భూమి సారవంతంగా మారుతుందని,పంట దిగుబడి కూడా బాగుంటుందని పేర్కొన్నారు.ఈ పీఎండీఎస్ కిట్లు ఏల్చూరు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ రాఘవరావు,మండల టీడీపీ నేత దుద్దేల చిన్న గాలెయ్య,ఐసీఆర్పీ షేక్ చిన్న సైదా,సుంకర అరుణ,దుగ్గిరెడ్డి శివపార్వతి, కాలేషాగారి వలి పాల్గొన్నారు.

అభిరామ్‌కు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - పర్చూరు : మండలంలోని నాగులపాలెం వాటర్ ప్లాంట్‌లో పనిచేయుచున్న అభిరామ్‌కు రూ.90,000 ఆర్థిక సహాయం పర్చూరు రోటరీ ఆధ్వర్యంలో అందించారు. రోటరీ సభ్యుల సహకారంతో ఇటీవల పోట్రు హరిబాబు, కుమారుడు మణికంఠ చౌదరి ఒకేసారి మరణించిన కారణంగా హరిబాబు కుమారుడైన అభిరామ్ నాగులపాలెం వాటర్ ప్లాంట్‌లో పనిచేయుచున్న కారణంగా రూ.90,000 ఆ కుటుంబ సభ్యులకు విరాళముగా అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు తేళ్ల రమేష్ చంద్ర, నాగుబడి సుబ్బారావు, నాగుబైరు శ్రీనివాసరావు, ప్రసాద్, కొల్లా నరేంద్ర కుమార్, పాబోలు ఉదయభాస్కర్, కాసా అశోక్ కుమార్, కారుమూడి సుబ్బారెడ్డి, పాబోలు వెంకటేశ్వర్లు, కోడూరి సుబ్రహ్మణ్య చారి, కోట శ్రీనివాసరావు, నాగులపాలెం గ్రామ వైస్ సర్పంచి అడ్డగడ రామకృష్ణ, ఆర్పీసీ సెక్రెటరీ అడ్డగడ్డ చిన్న నాగేశ్వరరావు, కొల్లా భాస్కరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' జయప్రదానికి పిలుపు

విశాలాంధ్ర - సంతమాగులూరు : కూటమి ప్రభుత్వం ప్రజలపై కాలకూట విషం గక్కుతూ పాలనను,వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న వారి ఏడాది పాలనలోని వైఫల్యాలను ఎండగడుతూ వైసీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంతమాగులూరు మండల కన్వీనర్ ఊట్ల నాగేశ్వరరావు మంగళవారం ప్రకటనలో పిలుపునిచ్చారు.ఈనెల 4వ తేదీ బుధవారం ఉదయం 9.30 గంటలకు అద్దంకి పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఇన్‌ఛార్జ్ పాణెం చిన్న హనిమిరెడ్డి ఆధ్వర్యంలో నిరసనలు తెలుపనున్నట్లు చెప్పారు. కావున మండలం పరిధిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

వ్యాస రచన పోటీలు



విశాలాంధ్ర - చీరాల రూరల్ : వేసవి శిక్షణ తరగతులలో భాగంగా చీరాల శాఖ గ్రంథాలయంలో పిల్లల్లో దాగివున్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడా నికి స్వర్ణాంధ్ర-2047 అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాస రచనలో అద్భుత ప్రతిభ కనబరిచిన వారిని అభినందించారు. మొత్తం 12 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయిని ఆర్.రూపాదేవి పర్యవేక్షించారు. గ్రంథ పాలకు రాలు డి.ధనమ్మ నిర్వహించారు. నాల్గవ తేదిన చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - అద్దంకి : గంజాయి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని అద్దంకి సీఐ సుబ్బరాజు అన్నారు. మంగళవారం అద్దంకి బస్టాండ్ సెంటర్లో గంజాయి మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. పిల్లలను తల్లిదండ్రులు వారి ప్రవర్తన గురించి గమనిస్తూ ఉండాలన్నారు. గంజాయి మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1072కు సమాచారం అందించాలన్నారు. యువత ఇటీవల కాలంలో గంజాయి మత్తు పదార్థాలు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి మత్తు పదార్థాలను సేవిం చిన రవాణా చేసిన సంబంధిత వ్యక్తులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మత్తు పదా ర్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి రూపొందించిన కరపత్రాలను సీఐ ఆవిష్కరించారు.

దివ్యాంగులు, వృద్ధులకు రేషన్ ఇంటివద్దనే ఇవ్వాలి

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రేషన్ షాపులో రేషన్ 65 సంవత్సరములపై బడిన వృద్ధులకు, వికలాంగులకు రేషన్ షాప్ డీలర్ ఇంటి వద్దనే రైస్ అందించాలని రేపల్లె తహశీల్దార్ మోర్ల శ్రీనివాసరావు రేషన్ డీలర్లకు తెలిపారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఈ విషయం పట్టణ, గ్రామాలలో ప్రజలకు తెలియజేయాలని ఆయన కోరారు. మున్సిపల్ పరిధిలోని వార్డు సెక్రటరీ సచి వాలయం సిబ్బందికి తగు సూచనలు చేశారు. మంగళవారం తాసిల్దార్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో రేషన్ డీలర్లు, వార్డు గ్రామ సచివాలయ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

పంటల సాగుకు ఉత్తమ యాజమాన్య పద్ధతులు అనుసరించాలి

విశాలాంధ్ర - సింగరాయకొండ : సింగరాయకొండ మండల పరిధిలోని కలికివాయ గ్రామంలో కెవికె సీనియర్ శాస్త్రవేత్త అధిపతి డా. జి. ప్రసాద్ బాబు, వ్యవసాయ అధికారి వి.సుధాకర్ అధ్యక్షతన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో వరి, పొగాకు, మినుము, శనగ, పంటలు పండిస్తున్నారని వాటిలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలని, వరి, పొగాకు, మినుము, శనగ పంటలలో నేల ద్వారా సంక్రమించే నల్లకాడ, వేరుకుళ్ళు, మొదలుకుళ్ళు తెగుళ్ళ నివారణకు ట్రైకోడెర్మ విరిడే, సూడోమోనాస్ అనే రొండు జీవశిలీంధ్ర నాశినులను 500 మీ.లీ. చొప్పున 100 కిలోల మగ్గిన పేడ ఎరువులో కలుపుకొని 15 రోజులు నీడలో మగ్గబెట్టి ఎకరా పొలంలో ఆఖరు దుక్కిలో వేసుకోవాలని తెలిపారు. మినుములో ఇమిడా క్లోప్రీడ్ మందుతో కిలో విత్తనానికి 5 మీ.లీ. కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలని తెలిపారు. అలాగే ప్రకృతి వ్యవసాయ విధానాల గురించి, ధృవీకరణ గురించి రైతులకు వివరించారు. అదే విధంగా కందుకూరు నిర్మా పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. యం. అనురాధా మాట్లాడుతూ నెల సారవంతత పెంచుకోవడానికి ప్రతి రైతు జనుము, జీలుగ, పిల్లిపెసర, అలసంద వంటి పచ్చి రొట్ట పైర్ల విత్తనాలు ఎకరాకు 10 నుండి 15 కిలోలు చల్లుకొని పూత దశలో భూమిలో కలియదున్నుకొని 50 కిలోల ఎస్ఎస్పి ఎరువును వేసుకోవాలని తెలిపారు. పొగాకులో మల్లె నివారణకు వేసవిలో లోతుదుక్కులు దున్నుకోవాలని, నువ్వుల పంటను పచ్చిరొట్ట పైరుగా వేసి కలియదున్నుకోవాలని, వేపచక్క 200 కిలోలు ఎకరకు వేసుకోవాలని, శనగ, మినుము, పెసర పంటలతో పంట మార్పిడి చేసుకోవాలని, మల్లె పూతకు రాకముందే తుంచి వెయ్యాలని, పొగాకు నారులో కలుపు నివారణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారులు రైతులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులు అరెస్ట్

విశాలాంధ్ర - కొమరోలు : మండలంలోని ఎడమకల్లు గ్రామ సమీపంలోని పొలాలలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను మంగళవారం ఎస్సై నాగరాజు అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్న వారి వద్ద నుంచి రూ.4,200 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నాగరాజు వెల్లడించారు. పేకాట ఆడటం చట్టరీత్యా నేరమని అటువంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలో జూదం, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే 9121102190 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న సందర్భంగా వ్యవసాయ శాఖ ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామని సంతమాగులూరు మండల వ్యవసాయాధికారిణి లావణ్య తెలిపారు. మంగళవారం ఆమె ఏల్చూరులోని రైతు సేవా కేంద్రం సందర్శించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ జీలుగలు 10కిలోల సంచి(2.5 ఎకరాలకు సరిపడా) మార్కెట్ ధర రూ.123(ఒక కిలో) ఉండగా రైతులకు రూ.61.50లకు రాయితీపై ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే జనుములు కూడా స్టాక్ రాగానే ఇస్తామన్నారు. పొలాలకు (వెబ్ ల్యాండ్‌లో నమోదు) పట్టాదారు పాసుబుక్ ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

రేషన్ పంపిణీ తనిఖీ

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండల వ్యాప్తంగా చౌక దుకాణాల డీలర్లు ఇంటి దగ్గర రేషన్ సరకుల పంపిణీ ప్రారంభమైనందని తహశీల్దార్ కె.రవిబాబు అన్నారు. ఏల్చూరులోని రేషన్ డీలర్ల షాపులను తహశీల్దార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసరాలను వారి ఇంటి వద్దకు తీసుకెళ్లి ఇవ్వాలని ఆదేశించారు.అదే విధంగా రేషన్ డీలర్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు.సరకులు ఇవ్వడం లేదని కార్డుదారుల నుంచి ఫిర్యాదులు అందినా, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట డీటీ రాఘవరావు ఉన్నారు.

లైబ్రరీలో క్విజ్ పోటీలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సంతమాగులూరు శాఖ గ్రంథాల యం ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకుడు బాదం విజయ భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన పోటీల్లో 16 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్విజ్,వ్యాసరచన పోటీలు ద్వారా పిల్లల్లో దాగివున్న నైపుణ్యాలను గుర్తించడానికి తోడ్పడుతుంద న్నారు. జ్ఞానాన్ని పెంపొందించే దిశగా వేసవి శిబిరాలు ఉపయుక్తంగా మారినట్లు చెప్పారు. అనంతరం యోగా సనాలు గురించి పిల్లలకు అవగాహన కల్పించారు.

ఖరీఫ్‌కు రైతులను సన్నద్ధం చేయాలి

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని బైట మంజులూరు, రామ కూరు గ్రామంలో ఖరీఫ్ సాగు సమయత్వం కార్యక్రమంలో భాగం గా వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సంవత్సరం రుతుపవనాల ప్రవేశం,అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తు న్నందున గ్రామాల వారీగా రైతులు వ్యవసాయ పనులకు సమాయత్తం అవుతున్నారని ప్రతి రైతు నాణ్యత కలిగిన మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో విధిగా బిల్లు తీసుకుని దాచుకోవాలని చెప్పారు.50 శాతం రాయితీపై వచ్చిరొట్ట విత్తనాలు జీలుగా రూ.61.50 కేజీలు, జనుము రూ. 54.5 కేజీలుపై రైతు సేవా కేంద్రంలో రైతు రిజిస్ట్రేషన్ చేయించుకొని పొందవచ్చనని వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. ఖరీఫ్‌లో సాగర్ నీటిని విడుదల చేసిన వెంటనే వరి విత్తనాలుతో నారుమళ్ళు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పృథ్వీ సాయి, రైతులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం

విశాలాంధ్ర - కర్లపాలెం : మండలంలోని పాతనందాయపాలెం గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు, పాత నందాయపాలెం గ్రామంలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దలు ఏర్పాటు చేసిన అన్న సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గ్రామ పెద్ద ఆక్వా పారిశ్రామికవేత్త అక్కల రమణ రెడ్డి,సీనియర్ మాజీ సైనికులు సుంకర శేషగిరి రావు, బాపట్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు చలికొండ వెంకట కృష్ణా రావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుకపల్లిలో శ్రీషిరిడి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలోని 17వ వార్డు ఇసుకపల్లిలో గల శ్రీ శిరిడి సాయిబాబా మందిర 78వ వార్షికోత్సవం జూన్ 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సాయిబాబా మందిర ఆహ్వాన కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా సాయిబాబా విగ్రహాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. సాయిబాబా మందిర జీర్ణోద్ధరణ సహిత గణపతి దత్తాత్రేయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవము సాయిబాబా 78వ వార్షికోత్సవములు మహా కుంభాభిషేక కార్యక్రమం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.ఆదివారం నుండి షిరిడి సాయిబాబా వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు గ్రామోత్సవం ఘనంగా ప్రారంభమైనాయి.బ్రహ్మశ్రీ నందివెలుగు బాలాజీ గురుకుల్ ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠ యంత్ర స్థాపన కార్యక్రమం జరుగుతుందని కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయవలసిందిగా నిర్వాహకులు కోరారు.

అరాచక పాలన మర్చిపోలేరు..

- జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అనురాధ

విశాలాంధ్ర - వేమూరు : గంజాయి మత్తులో ఆగడాలు చేస్తూ ప్రజలను ఇబ్బంది పెట్టడమే కాకుండా పోలీసులపై తిరగబడుతున్న గంజాయి బ్యాచ్‌కి మద్దతు ఇస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఏమని సందేశం ఇస్తారని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సోమరౌతు అనురాధ ప్రశ్నించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తెనాలి పట్టణంలో గంజాయి మత్తులో పోలీసులపై తిరగబడినటువంటి యువకులను పోలీసులు మందలిస్తే దాన్ని ఆసరాగా చేసుకుని రాష్ట్రంలో ఏదో జరిగిపోతుంది అన్నట్టుగా వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి పరామర్శ యాత్ర చేయడం ఆయనకే చెల్లింది అన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమంతో కూడిన సుపరిపాలన అందిస్తుంటే దాన్ని చూసి ఓర్వలేక ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చలన్న ఉద్దేశంతో వైసిపి నేతలు ఇలాంటి అరాచకాలు పాల్పడుతున్నారని అనురాధ విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ఎన్ని కుయుక్తులు పన్నిన రాష్ట్ర ప్రజలు జగన్మోహన్ రెడ్డి అరాచక పాలన మర్చిపోరని అనురాధ తెలియజేశారు.ఇకనైనా వైసీపీ నేతలు రాష్ట్ర అవసరాలకు,ప్రజా సంక్షేమానికి సూచనలు చేస్తే ప్రజలు అర్థిస్తారు తప్ప కావాలని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తే ప్రజలు జగన్మోహన్ రెడ్డిని నమ్మే పరిస్థితి లేదని గ్రహించుకోవాలని ఆమె హితవు పలికారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఇచ్చిన ఆదేశాల మేరకు జూలై 5వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను సత్వరం పరిష్కరించే విధంగా పోలీసు అధికారులు సహకరించాలని రేపల్లె కోర్టు నూతన జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌పిడి వెన్నెల అన్నారు. స్థానిక న్యాయస్థానంలో కోర్టు హాల్లో రేపల్లె సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో సీనియర్ సివిల్ జడ్జి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ క్రిమినల్, సివిల్,ప్రీ లిటిగేషన్ వంటి కేసులతో పాటు బ్యాంకు లావాదేవీలు, భార్యా భర్తల మధ్య వివాదాలు, బిఎస్ఎన్ఎల్, ఆయా జాతీయ బ్యాంకులలో పెండింగ్లో ఉన్న పరిష్కారం కానీ, రాజీ పడదగిన కేసులను పరిష్కరించే విధంగా అధికారులు చొరవ చూపిసహకరించాలన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.దేవి సాయి శ్రావణి, రేపల్లె రూరల్ సీఐ సురేష్ బాబు, పట్టణ ఎస్సై రాజశేఖర్, రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, భట్టిప్రోలు, అడవులదీవి, సోడాయిపాలెం పోలీస్ స్టేషన్లో ఎస్సైలు, ఎక్సైజ్ ఎస్సై రాజశ్రీ, కోర్టు కానిస్టేబుల్,రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షులు గరికపాటి వెంకటగిరిధర్, కార్యదర్శి ఉప్పాల శ్రీనివాసరావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నాటు సారా వద్దు..ఆరోగ్యం ముద్దు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : నవోదయం 2.0లో భాగంగా నాటుసారాయి వలన కలిగే అనార్ధాల గురించి అవగాహన కొరకు బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది ప్రచార రథంతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల ఈ.ఎస్.టీ.యఫ్ సిబ్బంది, చిన్నగంజాం డీ-అడిక్షన్ సెం టర్ సిబ్బంది, బాపట్ల రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది వెదుళ్లపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి వెదుళ్ళపల్లి, బేతపూడి,స్టువర్టుపురం గ్రామాలలో ప్రచార రథంతో పాటుగా కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాటుసారాయి సేవించడం వల్ల కలిగే అనార్ధాలు, దానిని తయారు చేసిన లేదా అమ్మిన తీసుకునే చట్టపరమైన చర్యల ఉంటాయని తెలిపారు. అదే విధంగా ఇరు గ్రామాలలో ఎవరైనా నాటుసారాయి అమ్మిన లేదా తయారుచేసిన, ఈ క్రింది తెలుప బడిన 9440902478, 900039 3199 ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయన్నారు. రెండు గ్రామాలను నాటుసారాయి రహిత గ్రామా లుగా తీర్చిదిద్దుటకు వారి వంతు సహాయం చేయ వలసినదిగా ఇరు గ్రామాల ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సి.ఐ పి.గీతిక, సబ్-ఇన్స్పెక్టర్లు డి.ప్రభుదాస్, యస్.మౌనిక, వెదుళ్ళపల్లి ఎస్సై భాగ్యరాజ్,చిన్న గంజాం డీ-అడిక్షన్ సెంటర్ కో-ఆర్డినేటర్ నాగూర్ బాషా, సీనియర్ కౌన్సిలర్ ఎస్.కే.ఏ.బషీర్,బాపట్ల రెడ్ క్రాస్‌సిబ్బంది, వెదుళ్ళపల్లి సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కూచిన పూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగార్జున అన్నారు.మంగళవారం మండలంలోని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ టిబి వ్యాధి పట్ల శ్రద్ధ వహించాలని చెప్పారు. టిబి రహిత భారత్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు. టిబి వ్యాధికి వ్యతిరేకమైన పోషకాహారం అదే బలమైన ఆయుధమని చెప్పారు. వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల వ్యాధి తీవ్రత పెరుగుతుందని, ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి 6నెలల పాటు మందులు వాడితే నయమవుతుం దన్నారు. సూపర్వైజర్ మురళి మాట్లాడుతూ ఆశ వర్కర్లు కళ్ళే పరీక్షలకు ఎంపిక చేసిన అనుమానిత వ్యక్తులు నుంచి సాంపిల్స్ సేకరించి పిహెచ్సిలోని ల్యాబ్‌లో పరీక్షలు చేయాలని చెప్పారు.ఒక వేళ పాజిటివ్ వస్తే వెంటనే వారు 6 నెలలు పాటు మందులు వాడితే క్షయ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ హెచ్ఈఓ సాంబశివరావు, హెచ్.వి మాధవి, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్పిలు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్

విశాలాంధ్ర - మార్టూరు : పట్టణంలోని 16 బ్లాక్‌లో భగత్ సింగ్ కాలనీలో పేదలకు మంజూరు చేయనున్న స్థలాన్ని సబ్ కలెక్టర్ వెంకట త్రివినాథ్ తాహసీల్దార్ చిరంజీవి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వే సంజీవయ్యలు మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులను గుర్తించి త్వరలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేతుల మీదుగా నివాస పట్టాలు పంపిణీ చేస్తామని అన్నారు. వీరి వెంట 16 బ్లాక్ కౌన్సిలర్ దారి వేముల హర్షిత బాబి, వార్డు నాయకులు చల్లగాలి సాగర్, కాయకాకుల తిరుపతయ్య, శివ, జక్కి వెంకటేశ్వర్లు, కరిముల్లా, ఫక్రు మియా తదితరులు ఉన్నారు.

బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహం..అడ్మిషన్లు ప్రారంభం

విశాలాంధ్ర - మార్టూరు : మార్టూరులోని ప్రభుత్వ బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహంలో అడ్మిషన్లు ప్రారంభించినట్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సిహెచ్ రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.మూడో తరగతి నుండి పదో తరగతి వరకు చదివే బాలికలు హాస్టల్ అడ్మిషన్ల కోసం 9052908845, 863950 8164 సెల్ నంబర్లలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

కౌమార బాలికల నాయకత్వం సాధికారిక వైపు పయనం

విశాలాంధ్ర - రేపల్లె : బాపట్ల జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రేపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌లో మంగళవారం కిశోరి వికాసం సమ్మర్ కాంపెయిన్ పట్టణంలోని 13వ వార్డులో నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా కౌమార బాలికల నాయకత్వం సాధికారత చర్చించిన అంశాలు నాయకత్వం అనేది ఒక పదం కాదు అది ఒకచర్య,వ్యక్తిగతంగా మనలో నమ్మకం ఉండటం అనేది ముఖ్యమైన అవసరం సమూహంలో భాగంగా ఉండటం అన్నారు.మన సామూహిక సామర్థ్యాన్ని ఉపయోగించడం, భయాన్ని అంగీకరించటం, భయం ఉన్నప్పటికీ ముందుకు సాగటం అన్నారు. సృజనాత్మకంగా ఒక నాయకురాలిగా తాము ఎలా ఉన్నారు అనే ఉదాహరణతో వివరించటం,నాయకత్వం ప్రదర్శించడం కలసి పనిచేసే గుణం కలిగి ఉండటం,సహ విద్యార్థుల సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో భాగస్వామ్యం కావడం మొదలగు అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఎం సుచిత్ర,సూపర్ వైజర్ శివ జ్యోతి, మహిళాసంరక్ష కార్యదర్శి కవిత, అంగన్వాడీ కార్యకర్తలు, ఆషా కార్యకర్తలు, అంగన్వాడీ సహాయకులు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

ఇంటి వద్దకు రేషన్

విశాలాంధ్ర - వెలిగండ్ల : గ్రామ పంచాయతీలోని వెలిగండ్ల నందు డీలర్ రాజ్ కుమార్ ప్రభుత్వ ఆదేశాల మేరకు వృద్ధులు వికలాంగులకు ఇంటి వద్దకే రేషను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల మేరకు ఈ రేషన్ను వారి ఇంటికి వెళ్లి అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

గుర్రం మల్లేశ్వరమ్మ మృతికి సంతాపం

విశాలాంధ్ర - పామూరు : మండలంలోని సట్టుమడుగు గ్రామ సీనియర్ రాజకీయ నాయ కులు దివంగత ఇరిగినేని తిరుపతి నాయుడు ముఖ్య అనుచరులు కీర్తిశేషులు గుర్రం శేషయ్య సతీమణి గుర్రం మల్లేశ్వరమ్మ మంగళవారం మృతి చెందారు. మల్లేశ్వరమ్మ మృతి పట్ల కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఇరిగినేని రవీంద్రబాబు, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

కౌమార బాలికల నాయకత్వం సాధికారత అంశాలపై అవగాహన

విశాలాంధ్ర - కనిగిరి: మండల పరిధిలోని చిన్న అలవలపాడు అంగన్వాడి కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా కౌమార బాలికల నాయకత్వం సాధికారత అంశాలపై మంగళవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవిఎస్ పార్వతి ఆధ్వర్యంలో కిశోరి బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ ఇది బాలికలకు వారి జీవితంలో మరింత శక్తివంతమైన భాగస్వాములుగా మారడానికి సహాయపడే ముఖ్యమైన అంశం అన్నారు. ఆరోగ్యం, విద్య ,జీవన నైపుణ్యాలు, కమ్యూనిటీలో వారి పాత్ర అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని, సాధికారిత ద్వారా బాలికలు సామాజిక ,ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధించడానికి సహాయపడతాయని అన్నారు. దీనిని సాధించడానికి విద్య, ఆరోగ్యం, జీవన నైపుణ్యాలు, సమాజంలో భాగస్వామ్యం, నాయకత్వ అవకాశాలు, లింగ సమానత్వం గురించి వారికి అవగాహన కల్పించారు. అనంతరం బాల్యవివాహాలు దీనికి అవరోధం కలిగిస్తున్నాయని, బాల్యవివాహాలు చేసుకోబోమని, విద్యనభ్యసిస్తామని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సరస్వతి ,జ్యోతి, ధనమ్మ కిశోర్ బాలికలు పాల్గొన్నారు.

పీజీ ప్రవేశ పరీక్షను వాయిదా వేయాలి

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీ పరీక్ష రోజున జరిగే పీజీ ప్రవేశ పరీక్షను వాయిదా వేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి జాయింట్ డైరెక్టర్ కృష్ణమూర్తిని గుంటూరు జిల్లా మంగళగిరి నగర పరిధిలోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీ పరీక్షలు జరిగే రోజుల్లో పీజీ ప్రవేశ పరీక్షలు నిర్వహించడం వలన విద్యార్థులు అనేక ఇబ్బందులుపడుతున్నారని చెప్పారు. ఇది విద్యార్థుల జీవితంతో చెలగాటమాడే నిర్ణయమని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం వలన విద్యార్థులు అయోమయ పరిస్థితిలోకి వెళ్లిపోయారని అన్నారు. అనేకమంది విద్యార్థులకు డీఎస్సీ పరీక్షల రోజునే సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా ఉందని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న పీజీ ప్రవేశ పరీక్షలను వాయిదా వేసి, డీఎస్సీ పరీక్షలు లేని రోజుల్లో పీజీ ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్, గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివ, యశ్వంత్, ప్రణీత్, డేవిడ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరులో మలేరియా వ్యతిరేక ర్యాలీ

విశాలాంధ్ర- తుళ్లూరు : మండల కేంద్రమైన తుళ్లూరులో మంగళవారం మలేరియా వ్యతిరేక ర్యాలీ జరిగింది. జాతీయ మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, ఆశాలు, ఏఎన్ఎంలు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి టి.శివ పార్వతి మాట్లాడుతూ మలేరియా రహిత సమాజం కోసం జరిగే కృషిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. చికెన్ గున్యా, డెంగ్యూ, మలేరియా వ్యాధులు రాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమతెరలు వాడాలని చెప్పారు. కార్య క్రమంలో సీహెచ్ఓలు వెంకటరమణ, ఎంఎస్ఎం రాణి, సూపర్‌వైజర్లు సుధా కర్, డీఎస్ రెడ్డి, కె.నరసింహారావు, హెల్త్ అసిస్టెంట్లు ఎస్‌కే కరీమ్, సుధాకర్ పాల్గొన్నారు.

పినాకిని ఎక్స్‌ప్రెస్‌ను గుంటూరు మీదుగా నడపండి

విశాలాంధ్ర - గుంటూరు కలెక్టరేట్ : పినాకిని ఎక్స్‌ప్రెస్ విజయవాడ నుంచి గుంటూరు మీదుగా తెనాలి వెళ్లటం వలన అనేకమంది ప్రజలకు ఉప యోగకరంగా ఉంటుందని పలువురు గుంటూరు వాసులు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవిని ఆమె కార్యాలయంలో మంగళవారం కలిసి వినతి పత్రాన్ని . గుంటూరు నుంచి తెనాలి వెళ్ళటకు తెల్లవారుజామున వృద్ధులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, పినాకిని ఎక్స్‌ప్రెస్‌ను గుంటూరు మీదుగా నడపటం వలన ప్రజలకు, ఉద్యోగస్తులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో ప్రతిపాదనను కేంద్ర రైల్వే శాఖకు పంపి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలియజేసినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పార్థసారథి జంగాలపల్లి, వేణు(డీఎస్ఆర్), వజ్జా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బి రహదారులు అధ్వాన్నం

- ఆదమరిస్తే అంతే సంగతులు
- నిమ్మకు నీరెత్తిన అధికారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర - పొన్నలూరు : మండలంలో ఉప్పలదిన్నె అడ్డరోడ్డు నుండి రావులకొల్లు వరకు ఆర్అండ్‌బి రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. గోతుల్లో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. నిత్యం వాహన ప్రమాదాలు. పదుల సంఖ్యలో ప్రజలు గాయాల పాలవుతున్నారు. చినుకు పడితే రోడ్లు తటాకాలను తలపిస్తున్నాయి. గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం నేటికీ ప్రజలను వెంటాడుతుంది. నూతన ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలు రోడ్ల మరమ్మత్తుల మీద గంపెడు ఆశలు పెట్టుకున్నారు. నూతన ప్రభుత్వం వచ్చి సంవత్సరం అవుతున్న ఇంకా రోడ్ల పరిస్థితి మెరుగు పడలేదు. కనీసం ఆర్ అండ్ బి ప్రధాన రహదారిలో సైతం తట్ట మట్టి వేయని పరిస్థితి. దీంతో పొన్నలూరు నుండి చెరువు గట్టు మీదగా రావులకొల్లు వెళ్లే రహదారి ప్రధాన ఆర్ అండ్ బి రహదారిలో సైతం అడుగుకో గోతి ఉంది. రోడ్డులోని గుంతలు చెరువును తలపి స్తున్నాయి. గ్రామం దాటిన తరువాత సైతం పరకు

ఉన్న ఆర్ అండ్ బి రహదారి అడుగుకో గోతి తేలి ఉంది. దీంతో నిత్యం ఈ రహదారి మీద ప్రయాణిస్తున్న వందలాది మంది వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు సైతం తరచుగా మరమ్మత్తులకు గురవుతున్నాయి. ఆర్ అండ్ బి అధికారులు కనీసం స్పందించి గోతులను సైతం పూడ్చించి రహదారిలో ప్రయాణపు ఇక్కట్లు తీర్చాలని పొన్నలూరు మండలాల ప్రజలు ఆర్ అండ్‌బిఅధికారులను, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.

ఆత్మ రక్షణకు కరాటే అవసరం : ఎస్పీ అశోక్ బాబు

విశాలాంధ్ర - ఒంగోలు : సిద్ధార్థ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఒంగోలు హైదర్ క్లబ్ ఆవరణలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ ఎగ్జామ్ పోటీలు కరాటే చీఫ్ ఎగ్జామినేషన్ నల్లూరి మోహన్ రావు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పి(నాన్ క్యాడర్) ఎంఎస్ఎస్ అశోక్ బాబు మాట్లాడుతూ నల్లూరి మోహన్ రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు సమ్మర్ సమ్మర్ కోచింగ్ ముగింపు సందర్భంగా కరాటే గ్రేడింగ్ ఎగ్జామ్ నిర్వహించి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు బెల్టులు అందించారని తెలిపారు. సిద్ధార్థ కరాటే అసోసియేషన్ ఏపీ ప్రెసిడెంట్ మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ కరాటే ఆత్మ రక్షణకు ఆరోగ్యానికి స్కిల్ డెవలప్మెంట్‌కు ఎంతో ఉపయో గమని చదువుతో పాటు కరాటే నేర్చుకోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలలో మూడు శాతం క్రీడ లకు అవకాశం కలిగించిందని ఇది భవిష్యత్తులో విద్యార్థులు ఎంతో ఉపయోగమని తెలిపారు . స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గుండ వరపు రాఘవ మాట్లాడుతూ కరాటే లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన మా సంస్థచే జాతీయ అంత ర్జాతీయ స్థాయిలలో పోటీలకు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కరాటే అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు అసిస్ట్ డిప్యూటీ డైరెక్టర్ వడ్డేంపూడి సుజాత రావు ప్రకాశం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు కుర్రా భాస్కరరావు పాల్గొని గెలుపొందిన విజేతలకు పసుపు ఆరంజి బ్లూ బ్రౌన్ 3 బెల్టులు తోపాటు సర్టిఫికెట్లు అందజేశారు. కరాటే కోచస్ అట్లూరి శ్రీధర్, వల్లపు వెంకటేశ్వర్లు, పీవీ సుబ్రహ్మణ్యంలు వ్యవహరించారు. నేషనల్ ప్లేయర్స్ యశ్వంత్, మహేంద్ర విద్యార్థులు కరాటేడెమో నిర్వహించి ఆకర్షించారు.

యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి

విశాలాంధ్ర - త్రిపురాంతకం : భారతీయ సంస్కృతిలో భాగమైన యోగపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగ దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మందితో యోగ కార్యక్రమాలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర క్యాంపెయిన్ ను నెల రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ పేర్కొన్నారు. మంగళవారం త్రిపు రాంతకం మండల కేంద్రంలోని శ్రీ శ్రీమత్ బాల త్రిపురసుందరీ దేవి అమ్మ వారి దేవస్థానం ఆవరణ నందు యోగాంధ్ర-2025లో భాగంగా నిర్వహిం చిన యోగ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, వై పాలెం నియోజక వర్గం ఇం చార్జి ఎరిక్షన్ బాబు, దేవస్థానం చైర్మన్ ఐవి సుబ్బా రావులతో పాల్గొని జ్యోతి ప్రజ్వలనగావించి కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ గోపాల క్రిష్ణ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భాగమైన యోగ పై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఈ నెల 21న జరిగే అంత ర్జాతీయ యోగ దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మందితో యోగ కార్యక్రమాలు నిర్వహిం చేలా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర క్యాంపెయిన్ ను నెల రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21న వైజాగ్ లో జరిగే అంతర్జాతీయ యోగ దినోత్సవం రోజున గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొను యోగ కార్యక్రమానికి 5 లక్షల మంది ప్రజలు పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం గా నిర్దేశించామన్నారు. యోగాంధ్ర క్యాంపె యిన్ లో భాగంగా జిల్లాలోని గుండ్లకమ్మ,, త్రిపురాం తకం, పాకల, కొత్త పట్నం బీచ్ తదితర 4 పర్యా టక ప్రదేశాలను యోగాంధ్ర కార్యక్రమానికి ఎం పిక చేశామన్నారు. భారత ప్రభుత్వ ప్రతిపాదన తో 2014 సంవత్సరంలో 170 దేశాల ఆమోదంతో ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగ దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి ప్రకటిం చిన ద న్నారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని జరుపు కుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ వివరించారు. ప్రజలు తమ జీవన విధానంలో యోగాను భాగంగా చేసుకుని ఆరోగ్యమైన జీవనం సాగించాలన్నారు. మండల కేంద్రంలో, ప్రతి పట్టణ కేంద్రాల్లో యోగ రోడ్డు ను నిర్ధారించి ప్రతి రోజు యోగ సాధన చేసేలా చర్యలు తీసుకోంటామ న్నారు. వై పాలెం నియోజక వర్గం ఇంచార్జి ఎరి క్షన్ బాబు మాట్లాడుతూ, అంత ర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశా లతో రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజుల పాటు యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. యోగ సాధన అనేది మనస్సును లగ్నం చేయడంతో పాటు ఏకాగ్రత పెంపొందడంతో పాటు మనిషి జీవన విధానంలో క్రమశిక్షణ అల వడుతుందన్నారు. పతంజలి యోగ గురువు బాల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, వై పాలెం నియోజక వర్గం ఇం చార్జి ఎరిక్షన్ బాబు దేవస్థానం చైర్మన్ ఐవి సుబ్బా రావు, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిఎం హెచ్ఓ డా వెంకటేశ్వరరావు, పశు సంవర్ధక శాఖ డిడి శ్రీ రవి కుమార్, సెట్వెల్ సీఈఓ శ్రీమన్నారా యణ, ఆలయ ఈఓ శ్రీమతి రజనీ కుమారి, పర్య వేక్షకులు శ్రీ రంగరాజు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజలు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ యోగ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీని వాస్, ఎంపిడిఓ రాజ్ కుమార్, డిప్యూటి ఎంపిడిఓ రామసుబ్బయ్య,వైద్యాధికారి భాస్కర్ రెడ్డి, స్నేహ మాధురి, లక్ష్మీ దేవి, ఏ ఓ నీరజా, ఆర్ ఐ ముకుంద హరి,వివిధ శాఖల అధికారులు, ఎంపిపి ఆళ్ల సుబ్బమ్మ,త్రిపురాంతకం సర్పంచ్ పొన్నం వెంకట లక్ష్మీ, రాజుపాలెం సర్పంచ్ కృపావతి, అన్ని గ్రామాల ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఐ ఏల్చూరు శాఖలకు కార్యదర్శుల ఎంపిక

విశాలాంధ్ర - సంతమాగులూరు : సీపీఐ పార్టీ సంతమాగులూరు మండల సమితి పరిధిలోని ఏల్చూరులో రెండు గ్రామ శాఖలకు నూతన కార్యదర్శులను ఎన్నుకున్నారు. తొలుత మండల సమితి కార్యదర్శి మల్లెల ఏసోబు,సహాయ కార్యదర్శి కాలేషాగారి ఖాదర్ బాషా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏల్చూరు బీసీ కాలనీ శాఖ నూతన కార్యదర్శి పోలెబోయిన పెద్దిరాజు, సహాయ కార్యదర్శి దండూరి పోలయ్యలను ఎంపిక చేశారు. అలాగే ఏల్చూరులోని మాలపల్లి శాఖకు కార్యదర్శిగా పగిడి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సింగరకొండ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ ముస్తఫా, చీదర్ల కొండయ్య,మేకల రమణయ్య, పగిడి ఏసోబు, నక్క సాలేశ్వరి, పోట్లూరి అంజమ్మ, రాచూరి వీరాంజనేయులు పాల్గొన్నారు.

సామాన్య కుటుంబాలకు నాణ్యమైన విద్య

విశాలాంధ్ర - వేటపాలెం : గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా హరిజన్ పబ్లిక్ స్కూల్ ప్రారంభించామని స్కూల్ సెక్రటరీ డాక్టర్ పొగడ దండ రవికుమార్ తెలిపారు. వేటపాలెం మండలం రామన్నపేట విలేజ్‌లో హొరిజాన్ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పత్రికా మిత్రులతో డైరెక్టర్ పొగడ దండా రవికుమార్ మాట్లాడుతూ పేద ప్రజలు, సామాన్య కుటుంబాల పిల్లలకూ నాణ్యమైన విద్య అందించాలన్న తపనతో ఈ పాఠశాలను నిర్మించినట్టు తెలిపారు. విద్య అంద రికీ అందుబాటులో ఉండాలనే ఆశయంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. మూడు ఎకరాల మామిడితోట మధ్యలో ఆహ్లాదకరమైన ప్రకృతి వాతావరణంలో ఏర్పాటు చేసిన ఈ పాఠశాల పిల్లలకు ప్రకృతితో మమేకమ య్యేలా తీర్చిదిద్దబడినదని డైరెక్టర్ తెలియజేశారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ సిబ్బంది ద్వారా విద్యార్థులకు ఉత్తమమైన విద్యను అందించడమే తమ లక్ష్యమని వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో 7వ తరగతి వరకు జూన్ 12 నుండి క్లాసులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుతం అందు బాటులో ఉన్న తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను, వ్యాయామ ఉపాధ్యాయులను పరిచయం చేశారు.

నల్ల బర్లి పొగాకును వెంటనే కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర - పర్చూరు : నల్ల బర్లీ పొగాకును రైతుల వద్ద నుండి కొనుగోలు చేయాలని కోరుతూ గుంటూరు జిపిఐ ఆఫీస్ ముందు ధర్నాలు జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు గంగయ్య తెలిపారు. మండలంలోని పర్చూరు,నాగులపాలెం,వీరన్నపాలెం,ఉప్పుటూరు, చెరుకూరు గ్రామాలలో రైతులకు అవగాహన కలిగించారు. గుంటూరులోనే జిపిఐ పొగాకు కంపెనీ ఎదుట ఐదో తేదీ ఉదయం 10 గంటల నుండి ధర్నా నిర్వహిస్తున్నా మని రైతులందరూ పాల్గొని ధర్నాలు జయప్రదం చేయాలని కోరారు. పీ.కొం డయ్య,శ్రీనివాసరావు, శివయ్య, సత్యనారాయణ, కాసిం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర - వేటపాలెం : మండలంలోని వేటపాలెం టౌన్‌లోఉన్న వేటపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్లు మరమ్మత్తుల కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు దేశాయి పేటలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ప్రజలు గమనించి సహకరించవలసినదిగా ఏఇ అరుణకుమారి కోరారు.

టొబాకో బోర్డు పరిధిలోకి నల్ల బర్లీని చేర్చాలి

బి.హనుమారెడ్డి

విశాలాంధ్ర - అద్దంకి : టొబాకో బోర్డు పరిధిలోకి నల్ల బర్లి పొగాకును చేర్చాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.హనుమారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన అద్దంకి మండలం చక్రా యపాలెం, బొమ్మనంపాడు గ్రామాలలో పొగాకు రైతులను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హనుమారెడ్డి మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో రైతులు నల్ల బర్లి పొగాకు సాగు చేసినట్లు తెలిపారు. గిట్టుబాటు ధరలు లేక కొనుగోలు చేయక అప్పులపాలై జిల్లాలో ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకు న్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆత్మహత్యలు చేసు కున్న రైతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. నల్లబెర్లి పొగా కు రైతుల సమస్యల పరిష్కారం కోసం 5వ తేదీన గుంటూరు విద్యా నగర్ జిపిఐ కంపెనీ ఎదుట అఖిలపక్ష రైతు సం ఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు హనుమాన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని పొగాకు రైతులు హాజరై ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

గిడ్డంగులలో మౌలిక సదుపాయాల పరిశీలన

విశాలాంధ్ర - పర్చూరు : పర్చూరు, ఇంకొల్లులోని మార్కెట్ యార్డు ప్రాంగణంలలో ఉన్న గిడ్డంగులను బాపట్ల జిల్లా మార్క్ ఫెడ్ డిఎం అరుణ పరిశీలించారు. గిడ్డంగులలోనే వసతులను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట సహాయ వ్యవసాయ సంచాలకులు మోహన్‌రావు, మండల వ్యవసాయ అధికారి రామ్మోహన్ రెడ్డి, రైతులు ఉన్నారు.

రేషన్ షాపులో తహశీల్దార్ తనిఖీ

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని గ్రామాలలో చౌక ధరల దుకాణాలను తాసిల్దార్ పోపూరి సింగరావు తనిఖీ చేశారు. మండలంలోని కొండమంజులూరు గ్రామంలోని షాప్ నెంబర్ 5 డీలర్ సంధ్య పోగు విజయ రేషన్ షాప్ , కోటపాడులోని రేషన్ దుకాణాలను తహశీల్దార్ సింగరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈపీఓఎస్ మెషిన్ల పనితీరు, కాటాల అను సంధానం స్టాక్ రిజిస్టర్‌లో స్టాక్ బోర్డులు తోకం మొదలగు అన్ని విషయాలు తాసిల్దార్ తనిఖీ చేశారు. అలాగే ప్రతి నెల 1వ తేదీ నుండి 18వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు వారిలో సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటలు వరకు కార్డుదారులకు బియ్యం, పంచదార, సరుకు లను సక్రమంగా పంచాలని అలాగే వృద్ధులు మహిళలకు తప్పనిసరిగా వారి ఇంటి వద్దకే వెళ్లి సరుకులు అందించాలని డీలర్లకు ఆదేశాలు ఇచ్చారు.

దివ్యాంగులు, వృద్ధుల ఇంటికి వీఆర్వోలు వెళ్లాలి

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని ప్రతి వికలాంగ, వృద్ధుల ఇంటికి వీఆర్వోలు వెళ్ల లని తహశీల్దార్ పోపూరి సింగారావు ఆదేశిం చారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన మండల రేషన్ షాపు డీలర్లు,వీఆర్వోల సమావేశంలో తహశీల్దార్ సింగారావు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో 12 మంది వీఆర్వోలు ప్రతి వికలాంగ,వృద్ధుల ఇంటికి వెళ్లి రేషన్ సరుకులు బియ్యం, పంచదార తీసుకోవడానికి రేషన్ షాపుకు రావద్దని చెప్పాలని అలాగే వారికి ఇంటి వద్దకే సరుకులు అందజే సేలా రేషన్ డీలర్లను చూడాలని ఆదేశించారు. వృద్ధులకు, వికలాంగులకు వారి ఇంటి వద్దకే వెళ్లి సరుకులు అందించాలని అలా జరగని పక్షంలో సంబంధిత రేషన్ డీలర్లే బాధ్యులు అవుతారని వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఇది ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం అని అన్నారు. కార్యక్రమంలో 12 మంది వీఆర్వోలు 24 మంది రేషన్ షాపు డీలర్లు మండల ఏఓడి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

హోంమంత్రి అనిత వ్యాఖ్యలు చట్టవిరుద్ధం

దళితుల ఆత్మరక్షణ ర్యాలీలో 'నీలం' డిమాండ్

విశాలాంధ్ర - అద్దంకి : హోం మంత్రి అనిత తెనాలి దళిత యువకులపై పోలీసు అధికారులు చేసిన రాజ్య హింసపై కూటమి ప్రభుత్వం చేసిన కుట్ర పూరిత వ్యాఖ్యలు చట్ట విరుద్ధం రాజ్యాంగ వ్యతిరేకమని నీలం నాగేంద్రరావు మండిపడ్డారు. మంగళవారం అద్దంకి అంబేద్కర్ భవన్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ తెనాలి దళిత యువకులపై స్థానిక మంత్రి నాదెండ్ల మనోహర్ కుట్ర పూర్వకంగా పోలీసుల చేత అనాగరిక దాడి జరిపించార న్నారు. మూడు నెలల క్రితం తెనాలి ఐతానగర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని పోలీసులు మున్సిపల్ అధికారులచే అధికార బలంతో తొలగించాలని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్,తెనాలి మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రయత్నించారన్నారు. కానీ స్థానిక దళితుల ఆందోళనలతో ఆ ప్రయత్నం నీరుగారి పోయిందన్నారు. ఆ ఘటనలో పోలీస్ అధికారులకు స్థానిక దళితులకు మధ్య వివాదం నెలకొందన్నారు. చిరంజీవి అనే విశ్వాసమైన పోలీస్ కానిస్టేబుల్‌తో ఫిర్యాదు తీసుకొని పోలీస్ మామూళ్ల కోసం వేధించి తెనాలిలో దళిత,ముస్లిం యువకులపై తెనాలి-2 టౌన్ సిఐ రాములు నాయక్,3 టౌన్ సిఐ రమేష్ బాబులు తాలిబన్ తరహా పోలీస్ శిక్ష వేశారన్నారు. ఒంగోలులో తెలుగుదేశం పార్టీ నాయకుడు వీరయ్య చౌదరిని కిరాతకంగా హత్య చేసిన తెలుగుదేశం పార్టీ నాయకుల్ని పోలీస్ అధికారులు నడిరోడ్డుపై కొట్టక పోగా అరెస్టు చేసినప్పుడు కూడా మీడియా సమావేశంలో మోకాలు చూపించకుండా ముసుగువేయటం కుల వివక్ష కాదా అన్నారు. విశాఖపట్నంలో డాక్టర్ సుధాకర్‌ను నడిరోడ్డుపై పోలీసులు దాడి చేసి కొట్టినప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న అనిత డాక్టర్ సుధాకర్ ఇంటికి వెళ్లి పరామర్శించలేదా అని ప్రశ్నించారు. నేరానికి పోలీసు శిక్షలకు కూడా కులం ఉంటుందని హోం మంత్రి అనిత గుర్తించా లన్నారు. హోం మంత్రి అనిత ఉపాధ్యాయులు రాలే కానీ రాజ్యాంగ నిపుణురాలు కాదని న్యాయ శాస్త్రం చదవలేదని తెలుసుకోవాలన్నారు. చట్ట ప్రకారం పోలీసులు కేసు నమోదు చేస్తే కోర్టులు శిక్షలు విధించాలి కానీ శిక్షలు విధించే అధికారం ఏ ప్రభుత్వంలోనైనా పోలీసులకు లేద న్నారు. కేవలం తాలిబన్లు మాత్రమే బహిరంగ శిక్షలు వేస్తారన్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన రఘురామకృష్ణ రాజు ను ఆనాటి ప్రభుత్వం బహిరంగంగా నడిరోడ్డుపై కాకుండా సిబిసిఐడి కార్యా లయంలో అరికాళ్ళ కోటింగ్ ఇస్తే తెలుగుదేశం ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ఆ ఘటనకు బాధ్యుడిని చేస్తూ డీజీపీ హోదాలో ఉన్న పీవీ సునీల్ కుమార్ ను ఎందుకు సస్పెండ్ చేశార న్నారు. కావున నేరానికి పోలీస్ శిక్షలకు కులం ఉంటుందని తెలుగుదేశం న్యాయదేవత రాజ్యాంగ నిపుణురాలు హోం మంత్రి అనిత తెలుసుకోవాలన్నారు. తెనాలి దళిత యువ కులపై ఖాకీ దాష్టీకం చేసిన తెనాలి సిఐలు రాములు నాయక్, రమేష్ బాబులను ఎస్సీ, ఎస్టీ ప్రకారం అరెస్టు చేయాల న్నారు. తెనాలి దళిత యువకులపై 3కుట్ర పూరక ఖాకీ దాడి జరిపించిన సనాతన స్టార్ పవన్ కళ్యాణ్ రాజకీయ గురువు నాదెండ్ల మనోహర్‌ను మంత్రి వర్గం నుండి తొల గించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుని డిమాం డ్ చేశారు. మాల మహానాడు జిల్లా అధ్యక్ష కార్యద ర్శులు దారా అంజయ్య,అద్దంకి నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షులు అంకం కిరణ్ కుమార్, కాకుమాను రవి ఈకార్యక్రమానికి నాయ కత్వం వహించారు. ఈ కార్యక్ర మంలో యానాది సేవా సమితి నాయకులు పోలా జీవరత్నం పాల్గొన్నారు.